ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం


ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి వివిధ స్థాయిలలో సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవచూపాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. గురువారం కోస్గి పట్టణంలోని కడంపల్లి శివారులో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి దశలో నీటిపారుదలశాఖ, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయికి వెళ్లి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాల్సిందేనన్నారు. బఫర్‌జోన్ పరిధిలో ఉంటే ఆ జోన్‌కు 30మీటర్ల దూరంలో ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించాలన్నారు. బఫర్‌జోన్ పరిధిలో ప్లాట్లను తిరస్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెండోదశలో ఎంపీఓలు, ఎంపీడీఓలు నిబంధనలను అనుసరిస్తూ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కోస్గి మండలంలోని 57 పెండింగు దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, ఆర్‌ఐ సుభాష్ రెడ్డి, నీటిపారుదలశాఖ అధికారులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం..

తరలుతున్న పత్తి

- పూర్తిస్థాయిలో ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
- తక్కువకు కొంటున్న దళారులు, కర్ణాటక వర్తకులు

న్యూస్‌టుడే, కోస్గి


ఊట్కూరు వద్ద బారులుతీరిన పత్తి వాహనాలు

పత్తి పంటపై రైతులు పెట్టుకున్న ఆశలను వర్షాలు దెబ్బతీశాయి. ఉన్న పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా దళారులకు తెగనమ్ముకుంటున్నారు. పెద్ద ఎత్తున పంట కర్ణాటకకు తరలిపోతోంది. కొందరు రైతులు పత్తి తీసి ఇళ్లలో నిల్వ చేశారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి నాని ఇబ్బందులు పడుతున్నారు. భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో మార్కెటింగ్ అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సిద్ధమయినా, నేటికీ అందుబాటులోకి రాకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో తేమశాతం పెరుగుతుందని, అందుకే అధికారులు వెనుకడుగు వేస్తున్నారని రైతుసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు

కర్షకుల నిరసనలు: ధన్వాడలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉండవల్లి శివారులోని జాతీయ రహదారి పక్కనున్న పత్తి మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో జిన్నింగ్ మిల్లులకు కొందరు తరలిస్తున్నారు. నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని సరిహద్దు ప్రాంతాల్లో కర్ణాటక దళారులు పంటను తరలిస్తున్నారు. కోస్గి, మద్దూరు, గుండుమాల్ మండల రైతులు వికారాబాద్ జిల్లా తాండూరులో విక్రయిస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో జిన్నింగ్ మిల్లులు ఉన్నప్పటికీ వాటిని ఆలస్యంగా ప్రారంభిస్తుండడంతో దళారులు రంగప్రవేశంచేసి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..

జిల్లా	2022	2023	2024
మహబూబ్‌నగర్	1,15,380	85,830	79,128
నారాయణపేట	2,05,807	1,84,597	1,85,150
నాగర్‌కర్నూల్	3,52,429	2,35,530	2,10,970
వనపర్తి	21,689	17,411	12,301
జోగులాంబ గద్వాల	2,22,908	1,44,075	1,20,597

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..: ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 5.88 లక్షల ఎకరాలలో పత్తి సాగు అయ్యింది. గత ఏడాది కన్నా కొంత తగ్గింది. 41.19 లక్షల కింటాళ్ల పత్తి దిగుబడి ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే పత్తి తేమశాతం 8 నుంచి 12 లోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని గతంలో అధికారులు సూచించారు.

తక్కువ ధరకు అమ్ముకున్నా..

ఈ ఏడాది 9 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశాను. సుమారు 70 క్వింటాళ్ల పత్తి వచ్చింది. క్వింటా రూ.6,150 చొప్పున గ్రామంలోనే వ్యాపారులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువకు విక్రయించాను. సీసీఐ కొనుగోలు కేంద్రం ఉంటే క్వింటాకు కనీసం రూ.వెయ్యి అదనంగా వచ్చేది. నాకన్నా తక్కువ అమ్ముకునేవారూ ఉన్నారు. రైతుల వేదన అధికారులు ఆలకించాలి.


\- చిన్న మద్దిలేటి, రైతు, చెన్నిపాడు

ఉన్నతాధికారులకు నివేదించాం..: సీసీఐ కేంద్రం ఏర్పాటు గురించి అలంపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొడ్డెన్న, వైస్ ఛైర్మన్ కొమ్ముకుమార్, ఉన్నతాధికారులతో చర్చించానని, దీపావళి తర్వాత కేంద్రం ఏర్పాటయ్యే అవకాశాలున్నట్లు అలంపూర్ మార్కెట్ యార్డు కార్యదర్శి యల్లాస్వామి అన్నారు.

ఇసుక కొరతతో నిర్మాణ రంగం విలవిల

న్యూస్‌టుడే- నారాయణపేట, ఊట్కూరు


నీరు పారుతున్న నాగిరెడ్డిపల్లి వాగు..

జిల్లాలో ఇసుక లభ్యం కాక నిర్మాణదారులు లబోదిబోమంటున్నారు. కొన్ని రీచ్‌లలో వాగులలో నీరు ప్రవహిస్తుండటంతో ఇసుక తరలింపు నిలిచిపోవడం, ఇసుక అందుబాటులో ఉన్నచోట కొందరి నిర్లక్ష్యం మూలంగా అవసరానికి ఇసుక అందని పరిస్థితి ఏర్పడింది. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయి. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి నెలలు గడుస్తున్నా, ఇంత వరకు ఇసుక సరఫరా కాలేదని నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 7 ఇసుక రీచ్‌లు ఉన్నాయి. నాగిరెడ్డిపల్లి, నందిగామ, లింగల్‌చేడ్ రీచ్‌లలో ఇసుక అంతగా అందుబాటులో లేదు. ప్రస్తుతం మాగనూరు మండలం వర్కూర్‌లో మూడు, మక్తల్ మండలం దాసర్‌దొడ్డిలో ఒక రీచ్‌లో ఇసుక అందుబాటులో ఉంది. ఈ నాలుగు రీచ్‌లలో మొత్తం 65,554 క్యూబిక్ మీటర్ల (90వేల మెట్రిక్ టన్నులకు పైగా)ఇసుక అందుబాటులో ఉన్నట్లు భూగర్భ జల వనరుల శాఖ జిల్లాయంత్రాంగానికి నివేదించింది. వీటితోపాటు చిట్యాల్ వాగులో ఇసుక రీచ్ కోసం వినతులు వస్తుండటంతో అక్కడి సంబంధిత అధికారులు సైతం అక్కడ కూడా ఇసుక నిల్వ, వరదనీరు ఎంతమేర ఉందన్న విషయమై దృష్టిసారించారు.


ఊట్కూరులో నిలిచిపోయిన ఇంటి నిర్మాణ పనులు

ఆన్‌లైన్‌లో అర్జీ చేసినా

జిల్లాలో అందుబాటులో ఉన్నమేరకు సరఫరా చేయడం కోసం ఆన్‌లైన్‌బుకింగ్ తెరిచారు. కొన్ని నెలల కిందట ఆన్‌లైన్‌లో ఇసుక కోసం బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. ఇది వరకు వాగుల నుంచి ఇసుక తరలించేందుకు ఏర్పాటుచేసిన రహదారులు కోతకు గురవ్వడంతో ప్రస్తుతం వాహనాల రాకపోకలకు ఇబ్బందుల ఏర్పడుతున్నాయి. మట్టితో తాత్కాలిక రహదారి ఏర్పాటుచేసుకున్నప్పటికీ అధికబరువుతో టిప్పర్లు మట్టిలో దిగబడుతుండటంతో ఇసుక సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. గతంలో 192 మంది వినియోగదారులకు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్నారు.

పాతవారికి ప్రాధాన్యం

ఇసుక కొరత విషయమై భూగర్భ గనుల శాఖ ఆర్‌ఐ ప్రతాప్‌రెడ్డి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఆన్‌లైన్ బుకింగ్స్ ప్రారంభమైనప్పటికీ ఇదివరకు అర్జీ పెట్టుకున్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు.. కొత్తగా ఇసుక సరఫరాకు అనుమతులు ఇవ్వడంలేదన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించాక ప్రక్రియ వేగవంతం చేస్తామన్నారు.

గృహ ప్రవేశం ముహూర్తం ఉంది : వచ్చే నెలలో గృహ ప్రవేశం ముహూర్తం ఉంది. 5 ట్రిపుల ఇసుక కోసం ఆన్‌లైన్‌లో చాలనాలు కట్టాను. రెండు నెలలు గడుస్తున్నా, ఇంత వరకు ఇసుక అందలేదు. ఏడాదిలోగా గృహప్రవేశం చేయాల్సి ఉండటంతో ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితి ఉంది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.


\- హరీశ్, ఊట్కూరు.

పనులు దొరకటం లేదు : ఇసుక కొరత వల్ల ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మేస్త్రీలకు, భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరకటం లేదు. ఇసుక వస్తే తప్పా పనులు ప్రారంభించని పరిస్థితి ఉంది. ఈ పనిపైనే ఆధారపడిన మాకు ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులు మా పరిస్థితి అర్థం చేసుకోవాలి.


\- ఎల్లప్ప, తాపీ మేస్త్రి, సమిస్తాపూర్.

జక్కనపల్లి రోడ్డుకు రూ.2.90 కోట్లు మంజూరు

నర్వ, న్యూస్‌టుడే : నర్వ నుంచి జక్కనపల్లి గ్రామానికి వెళ్లే మూడు కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి రూ.2.90 కోట్లు నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ఈఈ హిర్యానాయక్, డీఈ కల్యాణ్‌రెడ్డి వెల్లడించారు. గురువారం జక్కనపల్లి మట్టిరోడ్డును సందర్శించి ఎక్కడెక్కడ కల్వర్టు నిర్మాణాలు ఏర్పాటు చేయాలో పరిశీలించారు. టెండర్లు పూర్తికాగానే తారురోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెండోదశలో కొత్తపల్లి, లక్కిడిదొడ్డి గ్రామాల మట్టిరోడ్లను తారుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఎఫ్‌డీఆర్ నిధులతో ఒక్కొక్క కల్వర్టు నిర్మాణానికి రూ.5లక్షలతో కొత్తపల్లి, లక్కిడిదొడ్డి, జక్కనపల్లి గ్రామాలకు రూ.15లక్షలు మంజూరైనట్లు చెప్పారు. వీటి పనులు పూర్తిచేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రాఘవేందర్ పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు రాక

పాలమూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం జిల్లా కేంద్రానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రహదారిలోని ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాలలో ఏటీసీ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అనంతరం మెట్టుగడ్డ ప్రాంతంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టాస్క్ కేంద్రం కోసం స్థల పరిశీలన చేస్తారని, తర్వాత రెడ్డి బాలికల వసతిగృహం సమీపంలో వృత్తి శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభిస్తారని వివరించారు. అనంతరం దివిటి పల్లి సమీపంలో ఉన్న ఐటీ టవర్‌ను పరిశీలన చేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

స్థానిక పోరుకు ముమ్మర ఏర్పాట్లు

జిల్లాలకు చేరిన కరదీపికలు


మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి చేరిన ఎన్నికల మాడ్యుల్స్, కరదీపికలు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్తులు, మండల పరిషత్తుల్లో ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. ఆయా స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయంపై స్పష్టత లేకపోయినా అధికారులు ఎప్పుడు ఎన్నికల తేదీలని ప్రకటించినా నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. బ్యాలెట్ పెట్టెలను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాల వారిగా బ్యాలెట్ పెట్టెల ఆవశ్యకత, మరమ్మతులు చేసేవి ఎన్ని అనే వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల శిక్షణకు సంబంధించిన మాడ్యుల్స్ ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు సంబంధించిన కరదీపికలు జిల్లాలకు చేరాయి. వాటితో పాటు వివిధ రకాల ఫారాలు కూడా వచ్చాయి.

నాలుగు జిల్లాల్లో 6 కొత్త మండలాలు.. : ఉమ్మడి పాలమూరులోని నాలుగు జిల్లాల్లో కొత్తగా మండలాలు ఏర్పడ్డాయి. ఈసారి జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో వీటిని పరిగణలోకి తీసుకుని మండల ప్రాదేశిక స్థానాలను పునర్విభజన చేయనున్నట్లు సమాచారం. తద్వారా రిజర్వేషన్లు కూడా మారనున్నాయి. జిల్లాలకు ఎన్నికల సామగ్రి చేరుతున్న నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలు రావాల్సి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా మహ్మదాబాద్, కౌకుంట్ల మండలాలు ఏర్పడ్డాయి. వనపర్తి జిల్లాలో ఏదుల, జోగులాంబ గద్వాల జిల్లాలో ఎర్రవల్లి, నారాయణపేట జిల్లాలో గుండుమాల్, కొత్తపల్లి ఇలా మొత్తం 6 కొత్త మండలాలు ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు పెరిగే ఆస్కారం ఉంది.

గోదాముల్లో ఎన్నికల సామగ్రి

ఉమ్మడి జిల్లాలో 1,700 పంచాయతీలు, 15,276 వార్డులు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో వార్డుల సంఖ్య పెరగడంతో పాటు ప్రతి వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఈ లెక్కన గతంలో మాదిరిగానే మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో ఉపయోగించిన బ్యాలెట్ పెట్టెలను తిరిగి రెండో, మూడో విడత ఎన్నికల్లోనూ ఉపయోగించుకోవచ్చు. విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు అవసరమైన పుస్తకాలు, సామగ్రి చేరుకోవడంతో వాటిని గోదాముల్లో భద్రపరిచారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలు, వాటిలో సమస్యలు, కొత్తగా ప్రతిపాదించే కేంద్రాల్లో సమస్యలున్నాయా అనే దానిపై మండలాల వారీగా ఏర్పాటు చేసిన కమిటీలు పరిశీలించి ఇప్పటికే నివేదికను సమర్పించాయి. కొత్తగా మరికొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశముంది. ప్రభుత్వం కుల గణనకు ఆదేశాలు జారీ చేయడం, దీనికి రెండు నెలలు గడవు ఇవ్వడంతో ఈ ఏడాదికి ఎన్నికలు లేనట్టేనని అధికారులు భావిస్తున్నారు. కులగణన పూర్తి చేసిన తర్వాత గత రిజర్వేషన్లను రద్దు చేసి కొత్తగా రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో ఉత్కంఠ నెలకొంది.

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీల సంఖ్య, ఓటర్ల వివరాలు ఇలా..

జిల్లా	పంచాయతీలు	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు	ఎంపీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు
మహబూబ్‌నగర్	441	168	16	16	3,836	2,57,529	2,58,647
నాగర్‌కర్నూల్	464	212	20	20	4,140	3,23,705	3,22,689
వనపర్తి	260	128	15	15	2,366	1,83,382	1,84,135
జోగులాంబ గద్వాల	255	141	13	13	2,390	1,91,313	1,96,875
నారాయణపేట	280	147	13	13	2,544	1,98,199	2,05,547

సామాజిక పోలీసింగ్ అమలు చేయాలి: డీఐజీ


ధన్వాడ పోలీసు స్టేషన్‌లో మొక్క నాటి నీళ్లు పోస్తున్న డీఐజీ

నారాయణపేట, ధన్వాడ, న్యూస్‌టుడే : ప్రతి పోలీసు స్టేషన్‌లో సామాజిక, స్నేహపూర్వక పోలీసింగ్ అమలుకు కృషి చేయాలని గద్వాల్ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ కోరారు. గురువారం మరికల్ సర్కిల్ కార్యాలయాన్ని, ధన్వాడ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు ఈ సందర్భంగా మరికల్‌లో కవాతు వందనం స్వీకరించిన డీఐజీ పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ విధుల నిర్వహణలో అంకితభావం చూపాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల్ని తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ధన్వాడ పోలీసు స్టేషన నిర్వహణను మెచ్చుకుని ఎస్ఐ రమేష్, సిబ్బందిని అభినందించారు. ఇక్కడ మొక్కలు నాటారు. ఆయన వెంట ఎస్పీ యోగేశ్ గౌతమ్, మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నారాయణపేట జిల్లా పోలీసు కార్యాలయాన్ని గురువారం జోగులాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ ఆకస్మికంగా తనిఖీచేశారు. అదనపు ఎస్పీ మహమ్మద్ రియాజ్ ఉల్ హక్, సీఐలు రాంలాల్, చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, శివ శంకర్, ఆర్ఐ నర్సింహా, ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్రామానికి పాతపేరే ఉంచండి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : పంచాయతీ తీర్మానం లేకుండా తమ గ్రామం పేరును నర్సిరెడ్డిపల్లిగా మార్చారని, ఈ విషయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జోక్యం చేసుకొని వందల ఏళ్ల నుంచి ఉన్న తమ గ్రామంపేరును బొందల్‌కుంటగానే కొనసాగించాలని ఆ గ్రామస్థులు బుధవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందించారు. తమ గ్రామానికి రికార్డుల్లో రెండు పేర్లు ఉండటంతో విద్యాపరంగా, రెవెన్యూ పనులు, ధ్రువపత్రాలకు అవరోధంగా మారిందన్నారు. బ్యాంకు అధికారులు ఖాతాలను సైతం తెరవడం లేదన్నారు. తమ గ్రామానికి పాత పేరు కొనసాగించాలని కోరారు.

చెకుముకి సైన్స్ సంబరాలకు సన్నాహాలు

- నవంబరు 7 నుంచి ప్రారంభం
- 8-10 తరగతుల విద్యార్థులు అర్హులు


పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 8-10 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు ఈ పోటీలుంటాయి. ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని 8-10 తరగతులు చదువుతున్న విద్యార్థులు చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.


పోటీల వివరాలు ఇలా

విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయిలో ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలు ఆదిలాబాద్‌లో డిసెంబరు 14-16 వరకు నిర్వహించనున్నారు. 8, 9, 10 తరగతులకు సంబంధించిన సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం, సమకాలీన శాస్త్ర, సాంకేతిక అంశాలపై పోటీలుంటాయి. వీటిని తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. అన్ని మండలాల విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విజేతలకు రాష్ట్రస్థాయికి పంపుతారు.

రాష్ట్ర స్థాయిలో..

చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయిలో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని జేవీవీ జిల్లా ప్రతినిధి బాల్‌రాం తెలిపారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

శ్రీశైలంలో 4 గేట్ల ద్వారా నీటి విడుదల


దిగువకు విడుదలవుతున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండింది. గురువారం 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,12,300 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 67,876 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటలకు 885 అడుగుల (212.387 టీఎంసీలు)గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి 70,552 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,18,776 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి చేరుతోంది.

పరిష్కారం కాని సాంకేతిక సమస్య

నాలుగో రోజూ మార్కెట్‌లో పంటల టెండర్లకు ఇబ్బందులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : సాంకేతిక సమస్య వల్ల నాలుగో రోజు కూడా వ్యవసాయ మార్కెట్లలో ఈ-నామ్ పద్ధతిలో టెండర్ల ప్రక్రియ జరగలేదు. ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లతో పాటు బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మ్యానువల్‌గా అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. 'ఇ-నామ్‌కు సాంకేతిక సంకటం' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్త మార్కెట్లలో అధికారులు, వ్యాపారులు, రైతుల్లో చర్చ కొనసాగింది. మార్కెట్ కార్యదర్శులు, జిల్లా మార్కెటింగ్ అధికారులు సమస్యను పరిష్కరించాలని ఉన్నత అధికారులకు లేఖలు రాశారు. సాంకేతిక సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, జిల్లాలోని ఈ-నామ్ మార్కెట్లలో సాధారణ టెండర్ల ప్రక్రియతోనే పంట కొనుగోళ్లు చేపట్టినట్టు జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి తెలిపారు.

విద్యుత్తు శాఖా మేలుకో..



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు, తీగల పరిస్థితి ఘోరంగా ఉంది. ఏ మాత్రం గాలివీచినా తీగలు తెగి ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం తిప్రాసుపల్లిలో ఓ రైతు పొలంలో కనిపించిన చిత్రమిది. విద్యుత్తు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో కర్రలు దన్నుగా ఉంచి తీగలు వేలాడకుండా ఆ రైతు ఏర్పాటు చేసుకున్నారు.

- న్యూస్‌టుడే, నారాయణపేట

భిన్న రీతిలో ఫ్లెక్సీలు



టైరోడ్ వద్ద గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కృష్ణా, న్యూస్‌టుడే : ఏడాది క్రితం తమ కుమార్తె విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకోవడానికి అందుకు అల్లుడు, అత్తమామలే కారణమని నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గుడేబల్లూరుకు చెందిన చెన్నయ్యగౌడ్ ఆరోపించారు. నిందితుల ఆచూకీ తెలియచేయాలని కోరుతూ విభిన్న రీతిలో కృష్ణా మండలం టైరోడ్, మక్తల్, మరికల్, మహబూబ్‌నగర్‌లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గత ఏడాది కర్ణాటక రాష్ట్రంలోని సేడం తాలూకా శంకరపల్లిలో తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అత్తమామలు గ్రామం విడిచి వెళ్లిపోయారని తెలిపారు. వివాహ సమయంలో తమ కుమార్తెకు ఇచ్చిన కట్నకానుకలు తిరిగి ఇస్తామని చెప్పి ఇప్పుడు కనిపించకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచూకీ కోసం తెలంగాణ, కర్ణాటకలో వెయ్యి బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో గురువారం సీతారాముల కల్యాణంను వైభవంగా జరిపించారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండ రామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. తిలకించేందుకు భక్తులు జిల్లా నలుమూలల నుంచి బీచుపల్లికి తరలివచ్చారు. ఆలయ పండితుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల కోలాహలం, భాజాభజంత్రీల నడుమ కల్యాణం కమనీయంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చక్కని జీవన శైలితోనే ఆరోగ్యం పదిలం

● మధుమేహం, గుండె, ఈఎన్‌టీ సమస్యలపై వైద్యుల సూచనలు

ఈనాడు ఈటీవీ తెలంగాణ అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన



ఆరోగ్య అవగాహన సదస్సుకు హాజరైన జనం

న్యూస్‌టుడే, పాలమూరు : అప్రమత్తత, చక్కని జీవన శైలితోనే వ్యాధులకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత ఇలా.. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించింది. చెవి, ముక్కు, గొంతు సంబంధ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, మధుమేహం, ఇతర అనారోగ్యాలపై ప్రముఖ ఫిజీషియన్ డా.శ్రీనివాస్‌రెడ్డి, గుండె జబ్బులపై కార్డియాలజిస్ట్ డా.మహేశ్‌బాబు అవగాహన కల్పించటంతో పాటు సందేహాలు నివృత్తి చేశారు. చాలా ఏళ్లుగా మధుమేహంతో బాధపడుతున్న తాము ఇన్సులిన్ తీసుకుంటున్నామని, ఇది ప్రమాదకరమా అని కొందరు అడగగా అదేమీ కాదని, మాత్రల కంటే ఇదే నయమని వైద్యులు తెలిపారు. నిద్ర సమస్య ఉందని కొందరు చెప్పగా తగినంత శారీరక శ్రమ ఉంటే తప్పక నిద్ర వస్తుందన్నారు. ఐదేళ్ల నుంచి గొంతు కింద పెద్ద గడ్డతో బాధపడుతున్నానని ఒకరు చెప్పగా జనరల్ ఆసుపత్రికి వస్తే చికిత్సలు అందిస్తామన్నారు. అనారోగ్యం వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించకుండా నేరుగా మాత్రలు కొన్నుకుని, సామాజిక మాధ్యమాల్లో దొరికే సమాచారంతో సొంత వైద్యం చేసుకోవద్దని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజూ 6 నుంచి 7 గంటలు నిద్ర పోవడంతో పాటు గంట పాటు వ్యాయామం చేయాలని, పోషకాహారం తీసుకోవాలి, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, ఒత్తిడి లేకుండా జీవించడం అవసరమని తెలిపారు.

పిండి పదార్థాలు తక్కువ తీసుకోవాలి



ప్రపంచంలోనే అత్యధిక మధుమేహం (డయాబెటిక్) బాధితులతో ఈ వ్యాధికి భారత్ రాజధానిగా మారింది. కార్బొహైడ్రేట్లు (పిండి పదార్థాలు) ఎక్కువగా ఉండే తెల్ల అన్నం, దుంపలు ఆహారంగా తీసుకునే అలవాటు ఉండటమే కారణం. గతంలో 40 ఏళ్ల తర్వాత ఈ వ్యాధి వచ్చేది. ఇప్పుడు 25 ఏళ్ల వారికి కూడా టైప్-2 వ్యాధి వస్తోంది. ఒత్తిడి, మానసిక సమస్యలతో సతమతం కావటం, కీళ్లు, ఇతర నొప్పుల మందులు, స్టెరాయిడ్స్ ఎక్కువగా వాడటం వల్ల కూడా వ్యాధి బారిన పడుతున్నారు. మధుమేహం వల్ల కంటి రెటీనా కూడా దెబ్బతింటుంది. గుండె, మూత్రపిండాలు, కాలేయం, నరాల బలహీనతలు, మంటల తదితర సమస్యలు, వస్తాయి. ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. మధుమేహం తీవ్రత ఎక్కువగా ఉన్నవారు ఇన్సులిన్ తీసుకోవాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కార్బొహైడ్రేట్లు ఉండే ఆహారం చాలా తక్కువగా తినాలి. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి. ఆరోగ్యం కోసం, మధుమేహం నియంత్రణకు రోజూ 5 కి.మీ.ల మేర నడవటం చాలా ముఖ్యం.

- డా.శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్

చెవిలో ఏది పడితే అది పెట్టకూడదు..



చెవి ద్వారా వినటమే కాదు దానితో పనులు జరుగుతాయి. అది చాలా సున్నితమైంది. చాలా మంది చెవిలో దురదగా అనిపిస్తే వెంటనే ఇయర్ బడ్స్, పుల్లలను పెట్టి అందులో ఉన్న వ్యర్థాలు బయటకు తీయడానికి ప్రయత్నిస్తారు. అలా చేయడం ఎంత మాత్రం మంచిది కాదు. వయస్సు పెరిగే కొద్దీ వినికిడి లోపాలు వస్తుంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రస్తుతం అనేక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నపిల్లల్లో టాన్సిల్స్ వస్తుంటాయి. తర్వాత తగ్గిపోతాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చదువులో వెనకబడుతున్న చిన్నారుల్లో వినికిడి సమస్యలు కూడా ఉండే అవకాశం ఉంటుంది. పిల్లల్లో సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చికిత్సలు చేయించాలి. చిన్నారులు సపోటా, శీతాఫలాలు వంటివి తినే క్రమంలో వాటి గింజలు కూడా మింగే అవకాశం ఉంటుంది. అవి శ్వాస నాళికలోకి వెళ్లి అడ్డుపడితే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉంటుంది. పసివాళ్లకు ఇలాంటి గింజలు అందుబాటులో ఉండకుండా పడేయాలి. నోటి క్యాన్సర్ రాకుండా నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. నోటిలో పుండు ఎక్కువ కాలం మానకపోతే ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదించాలి. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చాం. అన్ని రకాల చికిత్సలు అందిస్తాం. సద్వినియోగం చేసుకోవాలి.

- డా.సంపత్‌కుమార్ సింగ్, ఈఎన్‌టీ విభాగాధిపతి, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్

బరువు పెరిగితే గుండెపై ఒత్తిడి..




బరువు అధికంగా పెరగడం వల్ల గుండెపై ఒత్తిడి పెరిగి హృద్రోగ సమస్యలు ఉత్పన్నమవుతాయి. ధూమపానం కూడా గుండె వ్యాధులకు దారితీస్తుంది. మహిళలతో పోలిస్తే గుండె జబ్బులు, మరణాలు పురుషుల్లోనే ఎక్కువ ఉంటాయి. రుతుస్రావం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారు. నేడు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావటంతో గుండెపోటు వచ్చిన వారిలో 99 శాతం మంది బతుకుతున్నారు. బొడ్డు పైభాగం నుంచి గొంతు కింది భాగం వరకు గతంలో వచ్చిన నొప్పి కాకుండా కొత్త రకమైన తీవ్రమైన నొప్పి వస్తే అది గుండెపోటుకు సంకేతంగా భావించి వెంటనే అప్రమత్తం కావాలి. ఆయాసం, కళ్లు తిరగడం, చెమటలు ఎక్కువగా రావడం తదితర లక్షణాలు కూడా కనిపిస్తాయి. గుండెపోటు వచ్చిన మూడు నిమిషాల్లో వారికి సీపీఆర్ ప్రారంభించాలి. వెంటనే డిస్ప్రిన్ టాబ్లెట్ నాలుక కింద పెడితే గుండె పోటు తీవ్రతను తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి వైద్యులకు చూపించి చికిత్సలు ప్రారంభిస్తే ప్రాణాలను నిలబెట్టవచ్చు.

- డా.మహేశ్‌బాబు

దందా వెనక ఆ ముగ్గురు!

జీరో ఇసుక పేరుతో అక్రమం





తుమ్మిళ్ల రీచ్ వద్ద ఇసుక నిల్వలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో జీరో ఇసుక పాలసీ సరిహద్దులోని గద్వాల జిల్లాలో కాసులు కురిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇసుకాసురులు ఏకమై అధికారుల అండదండలతో జీరో ఇసుక పాలసీని ఇక్కడ యథేచ్ఛగా అమలు చేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. వెనుక గద్వాల జిల్లాకు చెందిన అధికారపార్టీ బడా నాయకుడి భరోసా, అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్టు సమాచారం. సరిహద్దు గుండా ఒక ఇసుక టిప్పర్ జిల్లాలోకి అడుగు పెడితే అధికార పార్టీ నేతలు నెలకు రూ. లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి, అలంపూర్ పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుడు, ఎర్రవల్లి చౌరస్తాలో ఓ యువకుడు ఇందులో ప్రధాన భాగస్వాములని తెలుస్తోంది.

అధికార పార్టీ నాయకుడి హస్తం : జిల్లాలో అధికారికంగా ఇసుక తవ్వకాలు జరగడం లేదు. ఇసుక తవ్వకానికి కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అధికార పార్టీ నాయకుడికి మధ్య కమీషన్ల విషయంలో వివాదం ఏర్పడటంతో ఐదు నెలలుగా తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో మన ఇసుక, మన వాహనం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుక దొరకడం లేదు. తుమ్మిళ్ల రిచ్ వద్ద 40వేల టన్నుల ఇసుక అంటే సుమారు 2 వేల టిప్పర్ల ఇసుక డంపుల రూపంలో అందుబాటులో ఉండటంతో, ఈ ఇసుక కోసం 150 టిప్పర్ల యజమానులు మన ఇసుక, మన వాహనం కింద ప్రభుత్వానికి సొమ్ములు చెల్లించి నెలలు గడిచినా అందడం లేదు. మరోవైపు సరిహద్దుల గుండా బ్లాక్ మార్కెట్లో ఇసుక సులభంగా దొరుకుతోంది. అధికారికంగా ఇసుక డంపులు అందుబాటులో ఉన్నా, నిర్మాణదారులకు ఎందుకు అందడం లేదో అంతు చిక్కని విషయం. ఈ తతంగం వెనుక బడానాయకుడి హస్తం ఉన్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు మన ఇసుక, మన వాహనం కింద విక్రయించడానికి మీనమేషాలు లెక్కిస్తుండటం కూడా అనుమానాలకు తావిస్తోంది. మన ఇసుక, మన వాహనం కింద టన్ను ఇసుక రూ. వెయ్యి కాగా, బ్లాక్‌లో టన్ను ఇసుకను దళారులు రూ.2,800 లకు విక్రయిస్తూ రోజూ లక్షలా ర్జిస్తున్నారనే నిర్మాణ రంగంలో ఉన్న పలువురు అంటున్నారు. గద్వాల పట్టణానికి రోజుకు 6 నుంచి 10 టిప్పర్లు (ఒక్కో టిప్పర్‌లో 30 నుంచి 42 టన్నులు) ఇసుక రవాణా అవుతోంది.

చేస్తున్నారు ఇలా..

తుంగభద్ర నది అవతలి వైపున ఉన్న కర్నూల్ పట్టణ శివారు ప్రాంతాల నుంచి కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన వ్యక్తికి మధ్య ఉన్న అవగాహన ప్రకారం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి తెలంగాణ సరిహద్దు అయిన గట్టు మండలంలోని బల్గెర వరకు టిప్పర్‌ను తీసుకుని వస్తారు. అక్కడి నుంచి ధరూర్ మీదుగా గద్వాల పట్టణానికి ఆ టిప్పర్ చేరుకునే విధంగా పక్కా ప్లాన్‌తో సరఫరా చేస్తున్నారని సమాచారం. పదిహేను రోజుల కిందట ఇలా మంత్రాలయం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ధరూర్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కృష్ణానది అవతలివైపునున్న వనపర్తి జిల్లాలోని రంగాపురం, రాంపురం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా గద్వాల పట్టణానికి రవాణా జరుగుతోంది. ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన ఓ యువకుడు ఇందులో కీలక సూత్రధారి. టీఎస్ఎండీసీ ప్రాజెక్టు అధికారి రంగారెడ్డి వివరణ కోసం సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

'బెటాలియన్లు కావు.. రాచరికపు బంధిఖానాలు'



ఎర్రవల్లిచౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న పదో పటాలం పోలీసు కుటుంబాలు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: 'ఇవి బెటాలియన్లు కావు రాచరికపు బంధిఖానాలు' అంటూ ప్రత్యేక పోలీసు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఎర్రవల్లిచౌరస్తాలోని పదో పటాలంలో పనిచేసే పోలీసు కుటుంబాలలో కొందరు గురువారం సాయంత్రం ఒకే రాష్ట్రం.. ఒకే పోలీసు విధానం తీసుకురావాలంటూ ఎర్రవల్లిచౌరస్తాలోని జాతీయ రహదారిపై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 20 నిమిషాల పాటు జాతీయ రహదారిపై నిరసన తెలిపిన కుటుంబీకులకు ఇటిక్యాల, కోదండాపురం ఎస్ఐలు వెంకటేశ్, స్వాతి నచ్చచెప్పి నిరసన విరమింపజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నెలలో 26 రోజులు డ్యూటీలు వేస్తుండటంతో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పటాలంలో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా న్యాయం జరగలేదన్నారు. సివిల్, ఏఆర్‌లాగా ఒకే దగ్గర ఐదు సంవత్సరాలు డ్యూటీలు ఉంటూ కుటుంబాలను చూసుకునేలా మార్పులు తేవాలంటూ వారు డిమాండ్ చేశారు.

ఎగువ జూరాలలో సాంస్కృతిక పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సూరిబాబు, చిత్రంలో సీఈ రామసుబ్బారెడ్డి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎగువ జూరాల జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో గురువారం టీఎస్ జెన్‌కో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగుతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్ఈ సూరిబాబు మాట్లాడారు. ఉద్యోగులకు విధుల నిర్వహణతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు చెందిన పది విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల నుంచి 70 మంది అధికారులు, ఉద్యోగులు ఈ పోటీలకు హాజరయ్యారని తెలిపారు.

తెగిపడిన హెచ్‌టీ తీగలు

కాలిన ఫ్యాన్లు, మీటర్లు ● ఒకరికి గాయాలు



జావిద్ కాలికి గాయాలు



జక్లేర్‌లో దగ్ధమైన మీటర్లు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: హెచ్‌టీ విద్యుత్తు లైన్ తీగలు తెగి పడిన ఘటన మక్తల్ మండలం జక్లేర్ స్టేజీ వద్ద గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జావిద్ ఇంటి ముందు ఉన్న హెచ్‌టీ లైన్ తీగలు తెగి ఎల్‌టీ లైన్‌పై పడిపోవడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ఆ ప్రాంతంలోని నివాస గృహాల్లో 12 ఫ్యాన్‌లు, 10 విద్యుత్తు మీటర్లు కాలిపోయాయి. తీగపడిన క్రమంలో తూలిపడిన జావిద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే విద్యుత్తు ఉపకేంద్రానికి సమాచారం ఇచ్చి, సరఫరా నిలిపివేయించారు. ఈ ఘటనపై విచారణ చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు.

ఇథనాల్ పరిశ్రమ పనులు అడ్డుకున్న ప్రజలు



పనులను అడ్డుకునేందుకు వచ్చిన గ్రామస్థులు

రాజోలి, న్యూస్‌టుడే: మా అభిప్రాయం తీసుకోకుండా ఇథనాల్ పరిశ్రమ ఎలా ఏర్పాటు చేస్తారంటూ పరిసర గ్రామాల ప్రజలు పనులను అడ్డుకున్న సంఘటన గద్వాల జిల్లా రాజోలి మండలంలో గురువారం చోటుచేసుకుంది. గాయత్రి సంస్థ వారు పెద్ద ధన్వాడ గ్రామ శివారులో రైతుల నుంచి 25 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి పరిశ్రమ ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. పరిశ్రమ ఏర్పాటుకు తీసుకున్న భూమి పక్కనే దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమి 152 ఎకరాలు ఉంది. వీటితో పాటు చుట్టుపక్కల రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల కిందట పరిశ్రమ పనులు చేపట్టేందుకు రాగా ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. తిరిగి గురువారం సంబంధిత సంస్థ వారు పరిశ్రమకు అవసరమైన విద్యుత్తు స్తంభాలను, జేసీబీ, టిప్పర్, కంకర తీసుకురావడంతో పాటు గుడారాలను ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూర్, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాడు, నౌరోజి క్యాంపు ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకుని సంస్థ సిబ్బందితో వాగ్వాదం చేశారు. సీఐ టాటాబాబు, తహసీల్దార్ రాంమోహన్, ఎస్సై జగదీష్ ప్రజలను నిలువరించి మాట్లాడారు. సంస్థ వారు అనుమతులు చూపకుండా పనులు ఎలా చేపడతారంటూ అధికారులను ప్రశ్నించారు. కాగా పరిశ్రమ ఏర్పాటుకు తమకు అన్ని అనుమతులున్నాయని సంస్థ వారు తెలిపినప్పటికీ వాటిని చూపకపోవడంతో పనులు నిలిపి వేసి వెళ్లిపోవాలని డిమాండు చేశారు. సీఐ, తహసీల్దార్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి అనుమతులు చూపించి పనులు ప్రారంభించాలని సూచించగా వారు పనులు ఆపేశారు. పరిశ్రమ ఏర్పాటు చేయకుండా చూడాలని ఈ సందర్భంగా ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

రాయపురం క్వారీలో పేలుళ్లు: ఇద్దరికి గాయాలు



రాయి తగిలి గాయాలు

గద్వాల, న్యూస్‌టుడే: గట్టు మండలం రాయపురం శివారులో 199 సర్వే నంబర్‌లో భారత మాల పనుల కోసం క్వారీలో పేలుళ్లు జరపగా పక్కనే పొలంలో పనిచేసుకుంటున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో క్వారీలో పేలుళ్లు జరపటంతో బండరాళ్లు ఎగిసి పడి హరిజన తిమ్మప్ప కుమారుడు నవీన్, మరదలు పద్మమ్మకు గాయాలయ్యాయి. ఎలాంటి సమాచారం లేకుండా పేలుళ్లు జరపటంతో పక్కనే పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారు గాయపడ్డారని గట్టు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు తిమ్మప్ప వివరించారు. పేలుళ్లకు అనుమతులున్నాయో లేదో తమకు తెలియదని, చుట్టు పక్కల రెండు కి.మీ. దూరం వరకు ప్రజలు, రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత కంపెనీ ప్రతినిధులదని, ఆదేదీ చేయకుండా పేలుళ్లు నిర్వహించటం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని వారు వాపోయారు. ఈనెల 21 తేదీ నుంచి క్వారీలో బ్లాస్టింగ్ చేస్తున్నామని కంపెనీ ప్రతినిధులు సమాచారం ఇచ్చారని, సాయంత్రం 3 గంటల నుంచి ఐదు గంటల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని తహసీల్దార్ సరితారాణి పేర్కొంటున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన బాలిక మృతి

సీడ్ ఆర్గనైజర్‌పై కేసు

మల్దకల్, న్యూస్‌టుడే: బంగారం దొంగతనం చేసిందనే నెపంతో బాలిక (17)ను మల్దకల్ ఠాణాకు పిలిపించి విచారించగా ఆ అవమానం భరించలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. కాగా బాలిక చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. ఎస్సై నందికర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఈ సంవత్సరం మార్చి నెల నుంచి గద్వాలలోని బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పనులు చేయడానికి చేరింది. ఆగస్టు నెలలో తన ఇంట్లో బంగారు గొలుసు పోయిందని దానిని బాలిక దొంగతనం చేసిందని అనుమానం వ్యక్తం చేసి అడిగారు. ఆ తర్వాత గొలుసు ఇంట్లోనే దొరికిందని చెప్పారు. తిరిగి అక్టోబరు 11న గొలుసు దొంగతనం చేసిందని మల్దకల్ ఠాణాలో రాజశేఖరరెడ్డి ఫిర్యాదు చేయగా పోలీసులు బాలికను, తల్లిని ఠాణాకు పిలిపించి విచారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక అవమానం భరించలేక బిజ్వారంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స నిమిత్తం గద్వాలకు అనంతరం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం బాలిక మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తల్లి కవిత ఫిర్యాదు మేరకు సీడ్‌ఆర్గనైజర్ రాజశేఖరరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నందికర్ వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836



❓ పగిడిమారి నుంచి నారాయణపేటకు వెళ్లే రహదారిపై రంధ్రం ఏర్పడి, ప్రమాద భరితంగా మారింది. పెద్ద వాహనాలు వస్తే కూరుకుపోయే పరిస్థితి ఉంది. స్థిరాస్తి వ్యాపారులు ఇష్టానుసారంగా రహదారి తవ్వి పైపులు ఏర్పాటు చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- వెంకటేశ్ గౌడ్, ఓబ్లాపూర్**

✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరిస్తాం. పైపులు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాస్, ఆర్అండ్‌బీ పర్యవేక్షకుడు, మక్తల్.**



❓ ఊట్కూరు ఎంఎంఎస్ భవనం వద్ద మిషన్ భగీరథ ట్యాంకుకు వేస్తున్న పైపులైను పనులు అసంపూర్తిగా వదిలేశారు. పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడుతోంది. పట్టించుకునే నాథులే కరువయ్యారు. **- అనిల్, ఊట్కూరు.**

✔ ట్యాంకును వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేస్తాం. **- వెంకటేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఊట్కూరు**



❓ ఊట్కూరు పంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన శుద్ధజలం కేంద్రంలో యంత్రాలు మరమ్మతులకు గురై సేవలు నిలిచిపోయాయి. పట్టించుకునే నాథులే కరవయ్యారు. **-శంకర్, ఊట్కూరు**

✔ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాను. **- శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, ఊట్కూరు.**

- న్యూస్‌టుడే, ఊట్కూరు

తెరపై ఈనాడు

దేవర: మనోహర్ 70 ఎంఎం(నారాయణపేట), వెంకటరమణ(మక్తల్), **స్వాగ్:** మహేశ్వరి(నారాయణపేట), **విశ్వం:** రాఘవేంద్ర(మక్తల్), వనయాంబ(కోస్గి),

-న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం, కోస్గి గ్రామీణం

కూరగాయల ధరలు(కిలోకు)



టమాట రూ.70, వంకాయలు రూ.60, ముల్ల వంకాయలు రూ80, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.80, బెండకాయలు రూ.60, బీరకాయలు రూ.80, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.50, చిక్కుడు రూ.70, పెద్ద చిక్కుడు రూ.80, గోకరకాయ రూ.70, క్యాప్సికం 80, బీన్స్120, కాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.60, క్యాబేజీ రూ.50, ఉల్లి రూ.50, చింతపండు రూ.110 **- న్యూస్‌టుడే, నారాయణపేట (పాతబస్టాండ్)**



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

మద్దూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 26న మద్దూరు మండలానికి వస్తున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ గురువారం మద్దూరు చేరుకొని నిడ్జింత మార్గంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఆర్అండ్‌బీ, పోలీసు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. భద్రత ఏర్పాట్లు, రూట్‌మ్యాప్, వాహనాల పార్కింగ్, రహదారి క్లియరెన్స్, అగ్నిమాపక దళం, అంబులెన్స్ తదితర ఏర్పట్లపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహన్‌గౌడ్, ఎంపీడీవో నరసింహరెడ్డి, ఎస్ఐ రాంలాల్, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు నర్సిములు, మాజీ జడ్పీటీసీ రఘుపతిరెడ్డి, వీరేశ్‌గౌడ్, రమేష్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, మైపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు,

సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణం, పల్లెల్లో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఆందళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు జి.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ అధిక వర్షాలకు రైతులు సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీనికి తోడు కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు అంజనేయులు, గోవిందరాజు, నర్సింహా, నయీం, రైతులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేద్దాం



టీయూడబ్ల్యూజే మహాసభ గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : టీయూడబ్ల్యూజే జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేద్దామని జిల్లా కన్వీనర్ కె.నారాయణ రెడ్డి, ప్రతినిధులు రఘు, భీంసేన్‌రావు అన్నారు. గురువారం పేట అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ..27న జిల్లా కేంద్రంలోని శ్యాసన్‌పల్లి రోడ్డు బ్యాంక్వేట్‌హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్న జిల్లా ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సభకు తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ, ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికరెడ్డి, వాకిటి శ్రీహరి, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు.

యాసంగి సాగు 1,41,887 ఎకరాలు

పెరగనున్న వేరుశనగ అధికారుల అంచనాలు

న్యూస్‌టుడే, నారాయణపేట పట్టణం



దామరగిద్దలో సాగు చేసిన వేరుశనగ పంట

యాసంగి పంటల సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఖరారు చేశారు. వానాకాలం చివర్లోను అల్పపీడన ప్రభావంతో వర్షం కురిసి పత్తి పంటను దెబ్బతీసింది. నాణ్యత లేదంటూ వ్యాపారులు ధరలను తగ్గించేస్తున్నారు. ఈ క్రమంలో యాసంగి పంటలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో యాసంగిలో వరి, కుసుమలు, వేరుశనగ, జొన్న, మినుములు, శనగ, పొద్దుతిరుగుడు సాగు చేస్తుంటారు. పత్తి పంట అంతంతమాత్రంగా ఉండటంతో పత్తిని తొలగించి వేరుశనగ వేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పెసర, అలసందలు వేసిన రైతులు ఇప్పటికే వేరుశనగ సాగు చేశారు. కొందరు రైతులు పత్తి పంట తర్వాత వేరుశనగ వేసేందుకు సిద్ధం అవుతున్నారు. గత ఏడాది యాసంగిలో 1,47,300 ఎకరాలు సాగు చేస్తే, ఈ ఏడాది 1,41,887 ఎకరాలు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. వేరుశనగ పెరిగి అధికారుల అంచనాలు మించే అవకాశం లేకపోలేదు. మొదటి నుంచి సస్యరక్షణ చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి ■ పంట ■ ఈ సారి అంచనా

జిల్లాలో ప్రధాన పంటల సాగు ఇలా.. (ఎకరాలలో)	వరి	వేరుశనగ	జొన్న	అలసందలు	శనగ	
	1,30,000	10,000	1,300	450	137	1,41,887

అవసరమయ్యే ఎరువులు

ఎరువులు	మెట్రిక్ టన్నులు
యూరియా	9,000
డీఏపీ	5,000
కాంప్లెక్స్	7,000
ఎంఓపీ	300
ఎస్ఎస్‌పీ	200

ఘనంగా రఘుప్రేమ తీర్థుల జయంతి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : నారాయణపేట రాఘవేంద్రస్వామి దేవాలయంలో రఘుప్రేమ తీర్థుల 164వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాతం, నిర్మాల్యం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, హరిదాసుల సంకీర్తనలతో మహారథోత్సవం నిర్వహించారు. అనిల్ దేశాయి, హరీశ్ ఆచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ రఘుప్రేమ తీర్థుల మహిమలు కొనియాడారు. ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో నర్సింహాచారి, భీంసేన్‌రావు, ప్రభంజన్‌రావు, పద్మనాభరావు, మంజునాథ్ జోషి, నారాయణరావు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: భాజపా



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

ధన్వాడ, న్యూస్‌టుడే : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ధన్వాడలో భాజపా జిల్లా మీడియా సెల్ నాయకుడు ఉమేష్‌కుమార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆసరా పెంపు, మహిళలకు రూ. రెండున్నర వేల చెల్లింపు, రైతు భరోసా, రుణమాఫీ, కౌలు రైతులకు రైతు భరోసా తదితర హామీలు నీటి మూటలుగా మారాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నా బస్సుల సంఖ్య పెరగక పోవడంతో అసౌకర్యం కలుగుతోందన్నారు. భాజపా సభ్యత్వ నమోదు గడువు ఈ నెల 30తో ముగుస్తున్నందున వేగం పెంచాలని పార్టీ శ్రేణులను కోరారు. నారాయణపేట నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉన్న సభ్యత్వ నమోదు మందగమనంలో ఉండటం సరికాదన్నారు. నాయకులు రాంచంద్రయ్య, మల్లయ్య, లంకలి గోవర్ధన్‌గౌడ్, చింతన్ పూవు నర్సింలు, బాల్‌చందర్, నాగిరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 25న హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం వద్ద తలపెట్టిన మహాధర్నా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ పిలుపునిచ్చారు. గురువారం పురపాలిక కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల కార్మికులందరినీ బేషరతుగా క్రమబద్ధీకరించాలని కోరారు. . కనీస వేతనం అమలు చేయకుండా శ్రమదోపిడీకి పాల్పడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు హన్మంతు, కోశాధికారి సాయిలు, నాయకులు గణేష్, గోవింద పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఆక్షేపణీయం: వాకిటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సీఎంను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ నిర్మాణాత్మకమైన విమర్శలను తాము ఆహ్వానిస్తామని, వ్యక్తిగత దూషణలను సహించబోమన్నారు. గత 18 ఏళ్ల నుంచి ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఎత్తిపోతల విద్యుత్తు బిల్లులు ఏళ్లకు ఏళ్ల పేరుకుపోయాయని, నోటీసులు ఇచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆ బకాయిలను సైతం ప్రభుత్వం చెల్లిస్తుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమీకృత గురుకులాల నిర్మాణంకోసం పట్టణ సమీపంలోని సర్వే నంబరు 126లో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. 150 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, బోయ రవికుమార్, శివరాంరెడ్డి, అశోక్‌గౌడ్, శంకర్‌లింగం, సుదర్శన్ గౌడ్, నర్సింహారెడ్డిలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, న్యూస్‌టుడే : వానాకాలం వరి ధాన్యం కొనుగోళ్లపై గురువారం సాయంత్రం కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు? ఇంకా ఎన్ని ప్రారంభించాలో అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు సేకరించాలన్నారు. సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ.500ల బోనస్ పెంచిందని, కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉందన్నారు. డిజిటల్ మైక్రో మీటర్లు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, గన్నీ బ్యాగుల వివరాలపై మార్కెట్ కార్యదర్శి భారతితో ఆరా తీశారు. ప్రస్తుతం 1120 టార్పాలిన్లు ఉన్నాయని, అదనంగా 2620 టార్పాలిన్లు త్వరలోనే వస్తున్నట్లు ఆమె కలెక్టర్‌కు వివరించారు. అన్ని ఎలక్ట్రానిక్ కాంటాలపై తూనికల కొలతలశాఖ అధికారుల స్టాంపింగ్ పూర్తిచేయించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, పౌరసరఫరాలశాఖ డీఎం దేవదాస్, జిల్లా అధికారి సుదర్శన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్‌సుధాకర్, విండో అధికారులు పాల్గొన్నారు.

దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీహెచ్ఈవో విజయ్ కుమార్

ఊట్కూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎంపీహెచ్ఈవో విజయ్ కుమార్ సూచించారు. కొల్లూరు, మల్లేపల్లి పాఠశాలల్లో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. మద్యపానం, ధూమపానం వల్ల జీవితాలు ఎంతగా దెబ్బతింటాయో ఉదాహరణలతో వివరించారు.. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ నర్సింహులు, ఏఎన్ఎం మహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లివ్వాలి



ఎంపీడీఓ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు, గ్రామపంచాయతీ కార్మికులు

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎదిరింటి నర్సిములు డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు. గురువారం కోస్గి ఎంపీడీఓ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం అందడం లేదని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికులు ప్రమాదంలో మరణిస్తే కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి బీమా పథకాన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. కార్మికుల వేతనాలు చెల్లించకుంటే త్వరలోనే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్మికులు బాలయ్య, వెంకటయ్య, హనుమంతు, మొగులప్ప, లక్ష్మీ, మల్లేష్, రుక్కప్ప, తదితరులు ఉన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజులను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి ధర్నా నిర్వహించారు. మూడేళ్లుగా విద్యార్థులకు బకాయిలు విడుదల చేయకుండా జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో మరిన్ని ఉద్యమ కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏవో జయసుధకు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గౌస్, నాయకులు మహేష్, సురేష్, నవిత, నవ్య, అఖిల, శ్వేత, రాజు, శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వసతులు కల్పిస్తాం



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టరు గరిమ నరుల

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : కోస్గి గ్రంథాలయంలో నిరుద్యోగులు చదువుకునేలా సదుపాయాలు ఏర్పాటు చేస్తామని శిక్షణ కలెక్టరు గరిమ నరుల అన్నారు. గురువారం కోస్గి గ్రంథాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. కొత్త భవనాన్ని చూసిన ఆమె నిరుద్యోగులు నిత్యం గ్రంథాలయానికి వచ్చేలా పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన పుస్తకాలు, వివరాలు అందించాలని సిబ్బందికి తెలిపారు. ఏ వసతులు అవసరమో నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలిక మేనేజర్ యాదయ్య, గ్రంథ పాలకుడు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విశ్రాంత డీఈవో శివార్చక విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గాంధీ యువసేన సభ్యులు

ఊట్కూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని విశ్రాంత డీఈవో శివార్చక విజయ్‌కుమార్ అన్నారు. గాంధీ స్ఫూర్తితో చేపట్టిన సత్యశోధన పాదయాత్ర 23వ రోజు మండలకేంద్రానికి చేరింది. ఈ నేపథ్యంలో కళాశాల, పాఠశాల విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. చిన్నప్పటి నుంచి దేశభక్తి, ఆధ్యాత్మికత, నైతిక విలువలను పెంపొందించుకోవాలన్నారు. సేంద్రియ వ్యవసాయం, చేనేత వస్త్రాల ధారణ, సత్ప్రవర్తన వంటి అంశాలపై కూలంకషంగా వివరించారు. అంబేడ్కర్, వివేకానంద, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువకులు, నాయకులు విశ్రాంత డీఈవోను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ ఛైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు డి.విఘ్నేశ్వర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధి వై.జనార్దన్ రెడ్డి, గాంధీనగర్ యూత్ సభ్యులు జగదీష్ గౌడ్, అనిల్ గౌడ్, నరేష్ గౌడ్, తరుణ్, మనోహర్, లక్ష్మీనరసింహా, పాలమూరు ఎన్నారై ఫోరం ప్రతినిధి శ్యామ్ పాల్గొన్నారు.

తుంగభద్రలో 1.07 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

శాంతినగర్: తుంగభద్ర నదిలో 1,07,250 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. జలాశయం నుంచి 63 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద గురువారం 13.1 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ప్రధానకాల్వకు 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5.3 అడుగులుగా ఉంది. * సుంకేసుల జలాశయంలోకి ఎగువ నుంచి 1,18,200 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. జలాశయం నుంచి దిగువకు 1,15,736 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయం వైపు విడుదల చేస్తున్నారు.

డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఏబీవీపీ నాయకులు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : మక్తల్ పరిసర ప్రాంతాల్లో 800 మంది విద్యార్థులు డిగ్రీ పరీక్షలు రాయబోతున్నారని, వారికి పరీక్ష కేంద్రాన్ని మక్తల్‌లో ఏర్పాటు చేయాలని ఏబీవీపీ నాయకులు శివకుమార్, నగేష్‌లు అన్నారు. గురువారం పాలమూరు యూనివర్సిటీలో రిజిస్ట్రార్ మదుసూధన్‌రెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు. మాగనూరు, కృష్ణా మండలాల నుంచి డిగ్రీ పరీక్షలు రాయాలంటే నారాయణపేట, మరికల్ కేంద్రాలకు వచ్చిపోయేందుకు 150 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. సమయానికి రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, ఆదిత్య, పరమేశ్, విష్ణువర్ధన్‌లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా మరుగుదొడ్డి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో మొగులప్ప

ఊట్కూరు, న్యూస్‌టుడే : బహిరంగ మల,మూత్ర విసర్జన వల్ల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్డీవో మొగులప్ప సూచించారు. ఊట్కూరు మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఉపాధిహామి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న వారు వినియోగించేలా, లేని వారునిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తతో సంపద సృష్టి జరగాలని, కొత్త నర్సరీలను ఏర్పాటు చేయాలని, ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో ధనుంజయ గౌడ్, ఎస్‌బీఎం జిల్లా సమన్వయకర్త మాలిక్, ఉపాధిహామీ ఏపీవో సత్యప్రకాశ్, ఏపీఎం నిర్మల, ఈసీ మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్‌లో జాతీయ స్థాయికి ఎదగాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి అండర్-23 టోర్నీకి ముందస్తుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలను సద్వినియోగం చేసుకుని ఎదగాలని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. గురువారం ఎండీసీఏ మైదానంలో రెండో రోజు పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా తుది జట్టుకు ఎంపికవ్వాలన్నారు.

నారాయణపేట జట్టు విజయం.. : ఎండీసీఏ మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీలో రెండో రోజు నిర్వహించిన మ్యాచ్‌లో నారాయణపేట జట్టు కొడంగల్ జట్టుపై 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన కొడంగల్ జట్టు 16.5 ఓవర్లలో 35 పరుగులకు ఆలౌట్ అయ్యింది. నారాయణపేట నుంచి బౌలింగ్‌లో రోహన్, అద్నాన్ చెరో 3, ఎజాజ్ 2 వికెట్లు తీశారు. అనంతరం నారాయణపేట జట్టు 6.1 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అద్నాన్ 17, తరుణ్ 12 పరుగులు చేశారు.

వసతి గృహ మరమ్మతులు చేపట్టాలి



విద్యార్థులతో కలిసి వసతి గృహాన్ని పరిశీలిస్తున్న నాగేశ్

ధన్వాడ, న్యూస్‌టుడే : ధన్వాడ ఎస్సీ వసతి గృహ మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకుడు నాగేశ్ తహసీల్దారు సింధూజకు వినతిపత్రం అందజేశారు. వరండాతో పాటు భోజనశాల పెచ్చులూడి శిథిలమై పోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. వెనుక భాగాన ఉన్న వసతి గృహ స్థలం కబ్జాకు గురవుతుండటాన్ని గుర్తించిన ఆయన ఈ విషయాన్ని వినతిలో పేర్కొంటూ హస్టల్‌కు కేటాయించిన స్థలాన్ని సర్వే చేసి కంచె ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఈ విసయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దారు చెప్పినట్లు నాగేశ్ తెలిపారు.

రహదారుల మరమ్మతుకు వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న యువజన సంఘం ప్రతినిధులు

మద్దూరు, న్యూస్‌టుడే: కొత్తపల్లిలోని వివిధ కాలనీల్లో రహదారులు అధ్వానంగా తయారై ప్రమాదకరంగా మారాయని యువజన సంఘం సభ్యులు అవేదన వ్యక్తం చేశారు. మండల రెవెన్యూ కార్యాలయం రోడ్డు ఘోరంగా తయారయ్యిందని, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నరని వాపోయారు. ఈ సమస్యలపై వివేకానంద యువజన సంఘం సభ్యులు బాలుయాదవ్, అశోక్, కిరణ్, తిమ్మారెడ్డి, నాగమల్లు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

29న ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ : రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అండర్-14,17 బాల, బాలికల జట్ల ఎంపికలు ఈ నెల 29న మహబూబ్‌నగర్‌లోని డీఎస్ఏ మైదానంలో చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బోనఫైడ్, ఆధార్ ప్రతులతో ఉదయం 10 గంటలకు మైదానంలో కోచ్ ఖలీల్‌ను 98853 45211 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆక్రమణలను తొలగించాలని వినతి



తహసీల్దారుకు అందజేస్తున్న వినతి

మరికల్, న్యూస్‌టుడే : మరికల్ పట్టణంలోని రాయచూర్ రహదారిలో ఆక్రమించిన ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించాలని కోరుతూ రాష్ట్ర సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్ విన్నవించారు. ఈమేరకు తహసీల్దారు జమీల్‌కు వినతి పత్రం అందజేశారు. గతంలో మిల్లు మీదుగా ఇబ్రహీం పట్నం వెళ్లేందుకు రహదారి ఉండగా, దీన్ని పూర్తిగా కబ్జా చేసి భవనాలు నిర్మించారని వివరించారు.. విచారణ జరిపి కబ్జా చేసిన స్థలాన్ని కాపాడాలన్నారు.


పొంచి ఉన్న ప్రమాదం.. పట్టించుకోని నిర్లక్ష్యం



నాగిరెడ్డిపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభానికి రక్షణ ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. నిత్యం పాఠశాల విద్యార్థులు అటువైపు నుంచే వెళ్తుంటారు. విద్యుత్తు అధికారులు, సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్తుశాఖ అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఊట్కూరు

వ్యర్థాలు భీమార్పణం



వ్యర్థాలను భీమా ప్రాజెక్టు కెనాల్ పక్కన పారబోయడంతో నీరు కలుషితమవుతోంది. పట్టణంలోని దుకాణదారులు కొందరు వ్యర్థాలను సమీపంలోని భీమా కాల్వలో పారబోస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారి అమర్‌ను వివరణ కోరగా నోటీసులు ఇస్తామని, వ్యర్థాలను మున్సిపల్ వాహనాల్లో డంపింగ్‌యార్డుకు తరలిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, మక్తల్ పట్టణం**